క్లుప్తంగా

కొనసాగుతున్న సామాజిక తనిఖీలు



ఎల్విలో కొలతలు తీసుకుంటున్న సభ్యులు

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో 2022–23లో చేపట్టిన ఉపాధిహామీ పనుల వివరాలను సామాజిక తనిఖీ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ నమోదు చేస్తున్నారు. ఆదివారం నంద్‌గాం, ఎల్వి, జౌలా(బి), ఝరి(బి) గ్రామాల్లో పర్యటించారు. ఫాంఫాండ్, క్రీడామైదానాల కొలతలను తీసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి కూలీలు చేసిన పనుల వివరాలను, వారికి చెల్లించిన డబ్బులను తెలుసుకున్నారు. ఉపాధి కూలీలు నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు ఎస్ ఆర్పీ రాఘవులు తెలిపారు.

కనుల పండువగా అయ్యప్ప పడిపూజ



అభిషేకం చేస్తున్న స్వాములు

కుంటాల: మండలకేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో ఆదివారం కనుల పండువగా అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. హరిహర పుత్రుడికి పంచామృతాలతో అభిషేకించారు. గణపతి, సుబ్రహ్మణ్యం, కుమార స్వామి చిత్రపటాలను అలంకరించారు. గురుస్వామి జక్కని గజేందర్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు చేపట్టారు. గురుస్వాములు కదార్ల హరిప్రసాద్, ఉదయ్‌కుమార్, సిర్యూర్ రాజేశ్వర్, మల్లేశ్, నటరాజ్, ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

పెంబి: కోరుట్ల అసెంబ్లీ నియోజవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ముత్యం రఘును ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. పెంబి ప్రభుత్వ పాఠశాల పూర్వవిద్యార్థి కావడంతో రఘును మిత్రులు, గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. ఈయన గుర్తుకు 2,141 ఓట్లు పోలయ్యాయి. కార్యక్రమంలో సతీశ్, రాజబాబు, సంతోష్, నరేందర్, మహేందర్, శశి, రాకేశ్ తదితరులు ఉన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో పూజలు




పూజలు చేస్తున్న అర్చకులు

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, పల్లకిసేవ చేశారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, శివుని, అప్పారావుపేట్, ఇస్లాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి చిన్నారుల తలనీలాలు, తులాభారం సమర్పించి.. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

శివసాయి ఆలయ కార్యవర్గం

కుభీర్: మండల కేంద్రంలోని శివసాయి ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మ్యాకల నర్సప్ప, ఉపాధ్యక్షుడిగా దత్తాత్రి, ప్రధాన కార్యదర్శిగా బి.ప్రసాద్, సహాయ కార్యదర్శిగా నాగభూషన్, కోశాధికారిగా ప్రతాప్‌సింగ్, సలహాదారులుగా సంజు, సతీశ్ ఎన్నికయ్యారు.

పోచమ్మతల్లిని దర్శించుకున్న బీజేపీ శ్రేణులు



పూజలు చేస్తున్న బీజేపీ శ్రేణులు

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ, తిమ్మాపూర్(జి) బీజేపీ నాయకులు ఆదివారం గొల్లమాడ గ్రామ పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముధోల్ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి పవార్ రామారావు పటేల్ 23 వేల మెజార్టీతో గెలుపొందినందుకు మొక్కులు చెల్లించుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గొల్లమాడ సర్పంచ్ చెన్న మహేశ్, కాంట్రాక్టర్ వినోద్‌రెడ్డి, బాశెట్టి విజయ్‌కుమార్, గంగాధర్, లింగం, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో..

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలో ఉన్న మహాపోచమ్మ ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

దొడ్డు రకాలకే మొగ్గు

- యాసంగిలో మొదలైన వరిసాగు
- నారుమడులు సిద్ధం చేస్తున్న రైతులు



పొట్టపెల్లి వద్ద నారుమడికి దున్నిన పొలం



రాచాపూర్‌లో పోసిన వరినారు

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో యాసంగి సాగు పనులు ప్రారంభించారు. వరి కోతలు పూర్తి చేసిన రైతులు ప్రస్తుతం నారుమడులను సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే దుక్కి దున్నడం, విత్తనాలు తేవడం, నారు పోయడం వంటి పనులు చేస్తున్నారు.

మండలంలో ఇలా..

లక్ష్మణచాంద మండలంలో 18 పంచాయతీలు ఉండగా 22 గ్రామాలున్నాయి. కనకాపూర్, లక్ష్మణచాంద, పీచర అనే మూడు క్లస్టర్లలో 10,350 ఎకరాలలో వరిసాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే రాచాపూర్, లక్ష్మణచాంద, పీచర, పొట్టపెల్లి(కే), చామన్‌పెల్లి, చింతల్‌చాంద గ్రామాల్లో వరినార్లు పో యడం ప్రారంభించారు.

దొడ్డురకాల సాగుకే ఆసక్తి..

ఈసారి సన్నరకం వరి రకాలకు బదులుగా దొడ్డు రకాలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. వానాకాలంలో దొడ్డురకం వరి దిగుబడి బాగా రావడంతో యాసంగిలోనూ వాటినే సాగు చేస్తున్నారు. వరిలో సన్నారకాలతో పోలిస్తే దొడ్డురకాలకు తక్కువ పెట్టుబడులు అవసరమవుతాయి. కలుపు, పురుగు మందుల పిచికారీ లాంటి బెడద ఉండదు.

దొడ్డు రకాలివీ..

మండలంలోని వివిధ గ్రామాల రైతులు యాసంగిలో కేఎస్ఎం(కూనారం) 118, జేజీఎల్ 24423, ఎంటీయూ 1010, ఆర్ఎన్ఆర్ 15048, రకాలతో మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. వీటితోపాటు ప్రైవేటు రకాలైన కావేరి 99, కావేరి21 వంటివి కూడా మంచి దిగుబడులు వస్తాయని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

వరినారు పోశాం



వరికోతలు పూర్తయిన తర్వాత వెంటనే యాసంగి వరి పంట సాగుకు సంబంధించి రెండు రోజుల కిందటే వరినారు పోశాను. ఆలస్యమైతే నాట్లు వేసే సమయంలో ట్రాక్టర్లు, కూలీలు దొరకక ఇబ్బంది పడాల్సి వస్తుంది.

– ముత్యం, పీచర

స్వల్పకాలిక రకాలు సాగు చేసుకోవాలి



యాసంగిలో అన్నదాతలు వరిలో స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలి. తక్కువ సమయంలో మంచి దిగుబడులు వచ్చే రకాలను ఎంచుకోవడం ఉత్తమం. యాసంగిలో జింక్ దాతు లోపం రాకుండా జింక్ సల్ఫేట్ 2 గ్రా.లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. చలి తీవ్రత నుంచి కాపాడుకునేందుకు పలుచని వరినారుపై వస్త్రాలు కాని, పలుచని టార్పాలిన్ కవర్లు కాని కప్పాలి.

– ప్రవీణ్‌కుమార్, ఏవో, లక్ష్మణచాంద

కూనారం 118 విత్తనాలు సాగు చేశాం



ఈ వానాకాలంలో వరి సాగు చేస్తే దిగుబడులు బాగానే వచ్చాయి. ఇప్పుడు మళ్లీ దొడ్డు రకాలైన కూనారం 118 విత్తనాలు సాగు చేస్తున్నాం. దీంతో సన్నారకాల కంటే తక్కువ పెట్టుబడులు అవుతాయి.

– మెరుగు శ్రీనివాస్, లక్ష్మణచాంద

గ్రామాల్లో కావేరి ఫౌండేషన్ చేయూత

- చిన్నారులకు వైద్యపరీక్షలు, పెద్దలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ చక్రధారి

పెంబి: జిల్లా కేంద్రానికి చెందిన అప్పాల కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అప్పాల కావేరి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మండలంలోని బుక్కడెల్లి, రచ్చకోట గ్రామాల్లో చిన్నారులకు వైద్య పరీక్షలు, 60 గిరిజన కుటుంబాలకు స్వెట్టర్లు, దుప్పట్లు, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. దివ్యాంగురాలికి ఉచితంగా వీల్‌చైర్ అందజేశారు. రక్తహీనత, విటమిన్స్, మినరల్స్ లోపం ఉన్న చిన్నారులకు ఐరన్‌మాత్రలు అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ చక్రధారి, డాక్టర్ శ్రీనివాస్, ఫౌండేషన్ సభ్యులు తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న పీఆర్టీయూ నాయకులు

నిర్మల్‌రూరల్: మండలంలోని అనంతపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మురళి మృతి చెందడంతో బాధిత కుటుంబానికి పీఆర్టీయూ నాయకులు ఆదివారం ఆర్థికసాయం అందించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వారి నివాసానికి వెళ్లి ఉపాధ్యాయుడు సతీమణి ధనలక్ష్మికి రూ.లక్ష విలువైన చెక్కును అందించారు. సంఘంలో క్రియాశీల సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులు మృతి చెందితే రాష్ట్ర సంక్షేమ నిధి నుంచి ఆర్థికసాయం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరమేశ్వర్, వెంకటేశ్వర్, రమేశ్‌రెడ్డి, మోహన్, సంజీవరావు, శంకర్, గజ్జారాం, కృష్ణ, రవీందర్, బాపు, మన్మదరెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



ఖానాపూర్‌లోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

భైంసాటౌన్: పట్టణంలోని మదీనా కాలనీలో జెడ్పీ బాలికల ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12:30 గంటలకు ముగిసింది. 155 మంది విద్యార్థులకు గాను 154 మంది హాజరైనట్లు పరీక్షా కేంద్రం సీఎస్ గంగాప్రసాద్, డీవో నఫేఖాన్ తెలిపారు.

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన 156 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 154 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సంధ్యారాణి, డీవో ఊర్మిళ తెలిపారు. కాగా పరీక్ష కేంద్రంలో కుభీర్ డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి సిట్టింగ్ స్క్వాడ్ బాధ్యతలు నిర్వహించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



ఖానాపూర్‌లో బస్సు ప్రారంభిస్తున్న అధికారులు



నిర్మల్‌లో ప్రారంభిస్తున్న చైర్మన్ ఈశ్వర్

ఖానాపూర్: మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని అందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, ఆ పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో నిర్మల్ డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్‌తో కలిసి ఉచిత బస్సుసేవలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రోజు తెల్లవారుజామున ఐదు గంటలకు ఖానాపూర్–హైదరాబాద్‌కు సూపర్‌లగ్జరీ బస్సు సౌకర్యం కల్పించాలని నాయకులు ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో కంట్రోలర్లు మోయినొద్దీన్, శంకర్, అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, కిశోర్‌నాయక్, రాజునాయక్, జంగిలి శంకర్, మాజీద్, శంకర్‌గౌడ్, తోట సత్యం, జహీర్ అహ్మద్, ముషీర్, మీర్జాబేగ్, షకీల్, అయూబ్, రాజేశ్వర్ ఉన్నారు.

నిర్మల్‌లో..

నిర్మల్‌టౌన్: మహాలక్ష్మి పథకంలో భాగంగా నిర్మల్ బస్టాండ్‌లో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డితో కలిసి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా బస్సులోని మహిళలకు ఉచిత ప్రయాణ టికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సివిఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం సమష్టిగా పనిచేద్దాం

- నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మహేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న సంఘ నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నర్సాపూర్ వాసులు

నిర్మల్: నియోజకవర్గంలో మార్పు కోరుకుంటూ సహకరించిన ఉద్యోగులు, సిబ్బందికి ధన్యవాదాలని.. అందరం కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా జిల్లా టీఎన్‌జీవోల సంఘం ఘనంగా సన్మానించింది. జిల్లాకేంద్రంలోని ఏలేటి నివాసంలో ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరి సహకారంతో సమష్టిగా నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడదామని మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు వెల్మల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కూడాల రవికుమార్, కోశాధికారి భీమ సురేందర్, విక్రమ్ రాజ్, బి.శ్రీనివాస్, ఎస్.మోహన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, అశోక్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నర్సాపూర్ గ్రామస్తులు

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని ఆదివారం మండలంలోని నర్సాపూర్ గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. నర్సాపూర్ వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూలమాల, వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మణ్, జీవన్‌రెడ్డి, వీడీసీ సభ్యులు తదితరులున్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం

నర్సాపూర్(జి): సమష్టి కృషితో పని చేసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేకు నర్సాపూర్(జి), రాంపూర్, టెంబుర్ని, కుప్టీ, అంజనీతండా గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మండలం నుంచి 2,692 ఓట్లు అందించి గెలుపునకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాగే సర్పంచ్, లోకసభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి కాషాయ జెండా ఎగురవేయాలని సూచించారు. ఎవరికి ఎలాంటి పని ఉన్నా.. 24 గంటలు నా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని నాయకులు, కార్యకర్తలకు మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, వడ్డే రాజేందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు అర్జున్ ఠాకూర్, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, అధికార ప్రతినిధి బర్కుంట నరేందర్, శ్రీకాంత్‌రెడ్డి, భూమన్న, విజయ్, దత్తురాం, ప్రవీణ్‌పటేల్, శ్రీధర్, హరిలాల్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయికులు

ఖానాపూర్: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే నిరుపేదలకు రూ.10లక్షల రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని ఖానాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, ఆ పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, ఎంపీడీవో మల్లేశ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్డ్ ఆస్పత్రుల్లో ఈ పథకం తక్షణమే అమల్లోకి వస్తుందన్నారు. అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ పోస్టర్‌ను వైద్యులు, సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యులు కె.శివ, సంతన్, హెచ్‌ఈ జయలలిత, నాయకులు అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, కిశోర్‌నాయక్, రాజునాయక్, జంగిలి శంకర్, మాజీద్, షౌకత్‌పాషా, గంగనర్సయ్య, మడిగెల గంగాధర్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఉల్లాసంగా బోటింగ్



కడెం: కడెం ప్రాజెక్ట్, హరిత రిసార్ట్ ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. జగిత్యాల, నిర్మల్, మంచిర్యాల తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ప్రాజెక్ట్ అందాలను తిలకించి.. బోటింగ్ చేస్తూ ఉల్లాసంగా గడిపారు.



నేడు మన్మద్‌లో హనుమాన్ సప్తమి

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో సోమవారం హనుమాన్ సప్తమి వేడుకలను ఆలయ కమిటీ, వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచే హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని.. భక్తులు తరలిరావాలని కోరారు.

మాలల హక్కుల కోసం ఉద్యమిస్తాం

నిర్మల్: దేశవ్యాప్తంగా మాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు, హక్కులను సాధించేందుకు ఉద్యమిస్తామని మాల సంక్షేమ సంఘం నిర్మల్‌లోని బుధవార్‌పేట్ అధ్యక్షుడు డొంగరి లక్ష్మణ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బుధవార్‌పేట్‌లో సంఘ భవనంలో ఆదివారం సంఘ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డొంగరి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా డి.రాఘవేందర్, ప్రధాన కార్యదర్శిగా బత్తుల రాజేశ్వర్, కోశాధికారిగా ఎర్ర గంగాధర్, గౌరవ అధ్యక్షుడిగా ఎ.ముత్తన్న, సలహాదారులుగా సాంబయ్య, గంగన్న ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా ఎర్ర రవీందర్, దేవర ఫణిందర్ వ్యవహరించారు.

ఖానాపూర్‌లో ప్రయాణికుల అవస్థలు

- బస్టాండ్‌లోకి రాకుండానే జన్నారం వెళ్లిన బస్సు



జన్నారం వెళ్తున్న డిపో బస్సు

ఖానాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన విషయం తెలిసిందే. ఈ పథకంతో పలు చోట్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం జిల్లా కేంద్రం నుంచి వయా మామడ, ఖానాపూర్, కడెం, జన్నారం మీదుగా మంచిర్యాల వెళ్లే పలు బస్సులు రద్దవడంతో సాయంత్రం మంచిర్యాల ప్రయాణికులు నిర్మల్ బస్టాండ్‌లో ఆందోళనకు దిగారు. కనీసం జన్నారం వరకైనా బస్సు ఏర్పాటు చేస్తే అక్కడి నుంచి జన్నారం వెళ్లే బస్సులు, లేదా ఇతర వాహనాల్లోనైనా వెళ్తామని పేర్కొనడంతో అధికారులు నిర్మల్ టూ జన్నారం టీఎస్ 18 టీ 8489 నంబర్ కలిగిన బస్సును ఏర్పాటు చేశారు. దీంతో ఖానాపూర్ మీదుగా వెళ్లే ఏయే బస్సు అయినా బస్టాండ్ వరకు వచ్చి వెళ్లాల్సి ఉన్నా.. ఈ బస్సు బస్టాండ్ వెళ్లకుండానే ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా వెళ్లిపోయింది.

ఎమ్మెల్యేలను కలిసిన ఎంఐఎం నేతలు



అసదుద్దీన్‌ను కలిసిన నిర్మల్ నాయకులు

నిర్మల్: ఇటీవల తమ పార్టీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలను నిర్మల్ ఎంఐఎం నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో కలిశారు. ముందుగా ఆ పార్టీ కార్యాలయం దారుస్సలాంలో జాతీయ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతోపాటు హైదరాబాద్‌లో గెలిచిన ఏడుగురు ఎమ్మెల్యేలను సన్మానించారు. ఇందులో ఎంఐఎం నిర్మల్ నియోజకవర్గ అధ్యక్షుడు అజీంబిన్ యాహియా, ప్రధాన కార్యదర్శి మజర్, కౌన్సిలర్ అబ్రార్, మాజీ కౌన్సిలర్ రఫీఅహ్మద్‌ఖురేషి, తయ్యబ్, జునైద్ పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్‌లో వాహనదారుల అవస్థలు

సారంగపూర్: మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్‌లో ఆదివారం కరెంట్ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. జనరేటర్ అందుబాటులో లేకపోవడంతో ఇంధనం పోయించుకునేందుకు వచ్చిన వాహనదారులు రెండు గంటల పాటు పడిగాపులు కాశారు. బంక్‌లో తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు. తాము పెట్రోల్, డీజిల్‌పై చెల్లిస్తున్న పన్నులతో బంక్‌లో సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని అక్కడున్న సిబ్బందిని నిలదీశారు. ఈవిషయమై డీఎస్ఓ ఎస్ఎం అలీని వివరణ కోరగా పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు కల్పించాలని.. కరెంటు లేకుంటే ఇతర మార్గాల ద్వారా సేవలు అందించాలని పేర్కొన్నారు. సౌకర్యాలు కల్పించని బంకులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.